క్లుప్తంగా

ముగిసిన నామినేషన్ల పరిశీలన

● ఈ నెల 28 వరకు ఉపసంహరణకు గడువు

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి కార్పొరేటర్లు దాఖలు చేసిన నామినేషన్లను గురువారం అధికారులు పరిశీలించారు. స్థానిక నగర పాలక కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పాటు నామినేషన్లు వేసిన కార్పొరేటర్లు పాల్గొన్నారు. కార్పొరేటర్ల ఎదుటే నామినేషన్లను పరిశీలించిన అధికారులు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే వచ్చే నెల 1వ తేదీ నిర్వహించనున్న పోలింగ్‌కు సంబంధించి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీ వరకు కార్పొరేటర్లు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం 3 గంటలు దాటిన తరువాత అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఇదిలాఉండగా మూడేళ్ల తరువాత మొట్టమొదటి సారిగా నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎంపికకు పోలింగ్ జరుగనుంది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లతో పాటు మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ జునీద్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును శుక్రవారం ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లుగా ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజారులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా శుక్రవారం సెలవు ప్రకటించినట్లుగా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. శనివారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

మదరసాల అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసిన ముస్లిం మత పెద్దలు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో మదరసాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా సహకారం అందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ముస్లిం మత పెద్దలు సయ్యద్‌ఖలీద్, సాద్‌గర్ హిఫ్‌జుర్ రెహమాన్, ప్రిన్స్ ఖాజా కోరారు. వారు గురువారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి మదరసాల్లో పేద ముస్లిం విద్యార్థులకు అందిస్తున్న విద్య, సౌకర్యాలను వివరించారు. కొన్ని మదరసాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి హామీ ఇచ్చారు.

చెట్ల నరికివేతపై జరిమానా

కర్నూలు కల్చరల్: స్థానిక బీక్యాంప్ ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల ఆవరణలోని చెట్ల నరికివేతపై విచారణ చేపట్టిన అటవీ శాఖ అధికారులు జరిమానా విధించారు. అటవీ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా హాస్టల్స్ అధికారులు మొత్తం 8 చెట్లను పూర్తి స్థాయిలో కొట్టివేయించారు. దీనిపై ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప, మాల విద్యార్థి సంఘాల అధ్యక్షుడు వెంకటేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాజీవ్‌కుమార్ తదితరులు అటవీశాఖ అధికారి శ్యామలకు ఫిర్యాదు చేశారు. ఈమె కర్నూలు రేంజ్ ఎఫ్‌ఆర్‌ఓతో విచారణ చేయించారు. కొట్టేసిన 8 చెట్ల విలువ రూ.1,25,712గా నిర్ధారించి ఆ మేరకు జరిమానా విధించారు.

ముగిసిన షూటింగ్ బాల్ పోటీలు



విజేత జట్టుకు కప్పు, మెడల్స్ అందజేస్తున్న కల్లా నాగవేణి రెడ్డి

కర్నూలు (టౌన్): స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. చివరి రోజు జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన సాంఘిక సంక్షేమ పాఠశాల (మొదటిస్థానం, పత్తికొండ) సాంఘిక సంక్షేమ పాఠశాల (కంబాలపాడు, ద్వితీయ స్థానం), బాల భారతి పాఠశాల (మూడవ స్థానం, ఓర్వకల్) అలాగే బాలుర విభాగంలో సాంఘిక సంక్షేమ పాఠశాల (మొదటి స్థానం, సి.బెళగల్) ఆదర్శ పాఠశాల (ద్వితీయ స్థానం, కర్నూలు), గిరిజన ఆశ్రమ పాఠశాల (తృతీయ స్థానం, కర్నూలు) నిలిచాయి. విజేతలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్లా నాగవేణి రెడ్డి అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తన వంతుగా క్రీడలకు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశరాముడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● కర్నూలు నగరంలో ట్రాఫిక్ రద్దీకి యాక్షన్ ప్లాన్
● రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా



హాజరైన వివిధ శాఖల అధికారులు

కర్నూలు(సెంట్రల్): రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం మినీకాన్ఫరెన్స్ హాలులో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికంగా ప్రమాదాలు జరిగే 51 బ్లాక్ స్పాట్ల వద్ద, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించిన 52 ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ, హైవే అధికారులను ఆదేశించారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీపంలో జాతీయ రహదారిపై అండర్ పాస్ లేదా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు జాతీయ రహదారి 40 పీడీ తనను కావాలని, డీఓ లేఖను కూడా సిద్ధం చేయాలని డీటీసీని ఆదేశించారు. నన్నూరు హౌసింగ్ కాలనీ వద్ద సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కర్నూలు నగరంలో ట్రాఫిక్ రద్దీకి యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని, బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్, హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో రద్దీకి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆసుపత్రి ఎదుట స్ట్రీట్ వెండర్స్, ఆటో స్టాండ్ కోసం కొంత స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. రోడ్లపై ఆవులు, గేదెలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీక్యాంపులో ఆర్టీసీ బస్సులను రోడ్డు మధ్యలో నిలుపుతున్నారని, అలాగాకుండా రోడ్డుకు ఎడమవైపున నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌టీసీ ఆర్‌ఎంను ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలుగా రాజ్‌విహార్ సమీపంలో ఉన్న పాత డిపో నుంచి నందికొట్కూరు, నంద్యాల బస్సులు తిరిగే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. నగరంలో పని చేయని సీసీ కెమెరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి 15 రోజుల్లో కేసును పరిశీలించి రిపోర్టు ఇస్తే బాధితులకు రూ.2 లక్షల బీమా అందుతుందని పోలీసు, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ.. నగరంలో చాలా చోట్ల సీసీ కెమెరాల్లో విజువల్స్ సరిగా కనపడడంలేదని, దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని చెప్పారు. రహదారులపై ప్రమాదాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తామని ఎస్పీ వివరించారు. ముందుగా డీటీసీ శ్రీధర్ పవర్ పాయింట్ ద్వారా అజెండాను ప్రదర్శించారు. మునిసిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, ఆర్‌టీసీ ఆర్‌ఎం శ్రీనివాసులు, అదనపు డీఎంహెచ్‌ఓ భాస్కర్, ట్రాఫిక్, పీఆర్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలు నివారించండి

కర్నూలు(సెంట్రల్): ప్రసూతి మరణాలు సంభవించకుండా నిర్ణీత సమయంలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 2024 ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో సంభవించిన ప్రసూతి మరణాలపై వైద్యాధికారులతో సమీక్షించారు. 2024 మార్చి 6న జరిగిన బోయ సువర్ణ ప్రసూతి మరణంపై ఆరాతీయగా.. మార్చి 13వ తేదీ నుంచి ఆమె హైబీపీ, హైపర్‌టెన్షన్‌తో బాధపడుతూ 25న రాత్రి 8 గంటలకు డెలివరీ కాగా 26న తెల్లవారుజామున 1.40 గంటలకు చనిపోయిందని, ఆమె మరణానికి హైబీపీ పల్మనరీ ఎంబాలిజమ్ అని వైద్యాధికారులు వివరించారు. గర్భిణిగా ఉన్న 9 నెలలు బీపీ సాధారణంగా ఉండి చివరి 10 రోజుల్లో ఎక్కువ కావడంపై పరిశోధన చేశారా అని కలెక్టర్ ప్రశ్నించారు. ఇలాంటి కేసులు ఇతర జిల్లాల్లో నమోదయ్యాయా? కర్నూలు జిల్లాలో మూడేళ్లలో ఎంతమంది గర్భిణులు హైబీపీతో చనిపోయారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రసూతి మరణాలు అరికట్టడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే బోయ సువర్ణ తల్లిదండ్రులతో కలెక్టర్ మాట్లాడారు. కేస్‌షీట్, ట్రీట్‌మెంట్ వివరాలను పరిశీలించారు. అనంతరం ఆదోని మండలం కురువ వరలక్ష్మి మరణానికి కారణాలపై సమీక్షించారు. ప్రసూతి మరణాలను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన సబ్ కమిటీ పక్కా నివేదికలు సమర్పించాలన్నారు. చికిత్సలో లోపాలున్నాయా? వైద్యాధికారుల నిర్లక్ష్యం ఉందా? అని కమిటీ పరిశీలించాలన్నారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల విభాగాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించండి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని యువతకు ఉపాధి కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికలను రూ పొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువా రం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. కరువు మండలాలు, యాస్పిరేషన్ బ్లాకులలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇ వ్వాలన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో పనిచేసేందుకు అనువైన కోర్సులను గుర్తించి విద్యార్థు లకు అందులో తర్ఫీదు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమలు, ఎంప్లాయ్‌మెంట్, డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పది,ఇంటర్,డి గ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు చేసిన వారిని గుర్తించి నైపు ణ్య శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. అలాగే ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, మోటార్ విభాగాలతోపాటు టైలరింగ్,ప్లంబర్, కార్పెంటర్ తదితర అంశాల్లో శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో నైపు ణ్య శిక్షణకు సంబంధించిన యాప్‌ను డెవలప్ చేసి కంపెనీలు, వ్యాపార సంస్థలు, పారిశ్రామిక సంస్థలతో అనుసంధానం చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, మెప్మా పీడీ నాగశివలీల, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దీప్తి, పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాద్, అడిషనల్ మునిసిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, సెట్కూరు సీఈఓ రమణ పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో చేరిన రోగులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని డైట్ కాంట్రాక్టర్‌ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. డైట్ విభాగాన్ని పరిశీలించి ఎంత మంది రోగులు, వైద్యులకు భోజనం ఇస్తున్నారని ఆరా తీశారు. అనంతరం డైట్ భోజనాన్ని పరిశీలించారు. గత తనిఖీల్లో గుర్తించిన సమస్యలు ఎంతమేర పురోగతి సాధించాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్థో ఓటీ విభాగంలో తలుపులు మరమ్మతులు పూర్తి చేసినట్లు సిబ్బంది తెలిపారు. సర్జికల్ వార్డులో తనిఖీ చేసి డ్రైనేజీ సమస్య గురించి ఆరా తీశారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లతో మాట్లాడి డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. సర్జికల్ విభాగంలో టైల్స్, లైట్ల మరమ్మతులు పూర్తి చేశామన్నారు. ఆసుపత్రిలో నర్సింగ్ హెడ్ సిస్టర్ల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆయా విభాగాలను పరిశీలించి లైట్లు, ఫ్యాన్లు, ఇతర సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

కర్నూలు (లీగల్): జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన బాధితులకు సత్వర న్యాయం అందుతోంది. వివరాల్లోకి వెళ్తే... కర్నూలు సోమిశెట్టి నగర్‌కు చెందిన ఇ.నరేష్ బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ఫిబ్రవరి 28న రూ.36 వేలు వెచ్చించి హెయిర్ కంపెనీకి చెందిన వాషింగ్ మెషిన్ కొనుగోలు చేశారు. కొన్ని వారాలకే మెషిన్ సరిగ్గా పనిచేయకపోవడంతో కంపెనీ సర్వీస్ విభాగంలో ఫిర్యాదు చేశారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో గత నెల 10న కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు. కమిషన్ నోటీసు అందుకున్న హెయిర్ కంపెనీ, పిటిషనర్‌కు తాము కొత్త వాషింగ్ మెషీన్‌ను ఇచ్చామని తెలిపింది. మరో కేసులో పట్టణంలోని నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన ఎయిర్‌ఫోర్స్ మాజీ అధికారి వెంకటయ్య ఎల్‌జీ వాటర్ ఫిల్టర్‌ను కొనుగోలు చేశారు. మూడేళ్ల పాటు సర్వీస్ కోసం డబ్బు కూడా చెల్లించారు. ఫిల్టర్ సరిగా పనిచేయకపోవడంతో గత మార్చిలో ఎల్‌జీ సర్వీస్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సరైన స్పందన లేకపోవడంతో మే 9న కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. కమిషన్ నోటీసులు అందుకున్న ఎల్‌జీ సిబ్బంది పనిచేయని పరికరాన్ని మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ రెండు కేసుల్లో పిటిషనర్లు సంతృప్తి వ్యక్తం చేస్తూ బుధవారం కేసులను ఉపసంహరించుకున్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అక్రమంగా తొలగించిన సెక్యూరిటీ గార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అవినీతి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఓల్డ్‌సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ.. ఎలాంటి తప్పు చేయకపోయినా సెక్యూరిటీ గార్డులను అక్రమంగా తొలగించారని విమర్శించారు. అనంతరం సీఐటీయూ నాయకులు, సెక్యూరిటీ గార్డులు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డితో చర్చించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మారెళ్ల విజయ రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీజీలు సమర్థవంతంగా సెమినార్లు నిర్వహించాలి



మైక్రోబయాలజీ విభాగంలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): పీజీ వైద్య విద్యార్థులు సమర్థవంతంగా సెమినార్లు నిర్వహించాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ సూచించారు. ఆమె గురువారం మెడికల్ కాలేజీలోని మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలను పరిశీలించారు. సదరు విభాగాల్లోని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ఎస్‌ఆర్‌లు, పీజీలు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో పోస్టింగ్‌లో ఉన్న వారి హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విభాగాల్లో జరుగుతున్న పీజీల సెమినార్లు, డెంటల్, పారామెడికల్ విద్యార్థుల తరగతులను పరిశీలించారు. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల్లో ఎలక్ట్రిక్, ప్లంబింగ్ సంబంధించిన పనులు ఉన్నాయని తెలుపగా వెంటనే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ విభాగాల్లో సమస్యల గురించి హెచ్‌ఓడీలు డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ పద్మవిజయశ్రీలను అడిగి తెలుసుకున్నారు. తమ విభాగాల్లోని ల్యాబోరేటరీ పని విధానం, అందులోని సమస్యలు, సిబ్బంది కొరత, ఇతర ఇబ్బందులను వారు వివరించారు. మైక్రోబయాలజీ విభాగానికి మున్సిపల్ వాటర్ సదుపాయం కోసం అంచనాలు సిద్ధం చేసి పని పూర్తయ్యేలా చూడాలని ప్లంబర్‌కు సూచించారు. ప్రొఫెసర్లు నాగజ్యోతి, రూత్ లావణ్య, అసోసియేట్ ప్రొఫెసర్లు మాధవి, గాయత్రి, కుసుమ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు ఉన్నారు.

సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నర్సింగ్ విద్యార్థినులు

కర్నూలు(హాస్పిటల్): సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారించాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రోజా యూపీహెచ్‌సీ పరిధిలోని ఎల్‌వీటీజీ నర్సింగ్ కళాశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ.. జూలై 1 నుంచి ఈ నెలాఖరు వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామనే నినాదంతో నివారణ, నియంత్రణ చర్యలు వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని ప్రారంభించారు. బయాలజిస్ట్ వెంకటేశ్వర్లు, డెమో శ్రీనివాసులు, ఏఎంఓ చంద్రశేఖర్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భార్గవి, సూపర్‌వైజర్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కర్నూలు (అర్బన్): నగరానికి చెందిన సురేష్ అనే వ్యక్తిని కొట్టి గాయపరచాడనే ఫిర్యాదు మేరకు షరీన్ నగర్‌కు చెందిన ఇమ్రాన్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్ అరెస్ట్

నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంగోపాల్‌రెడ్డి అనే మట్కా బీటర్‌ను అరెస్టు చేసి రూ.1100 నగదు, పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.

పెద్దాసుపత్రి అభివృద్ధికి సహకరిస్తాం

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమకు పెద్దదిక్కుగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి చెప్పారు. ఆయన గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని కలిసి పలు అభివృద్ధి పనులు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులను కోరారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు కావాల్సిన వైద్యపరికరాలను ఆసుపత్రికి ఇచ్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో చర్చిస్తానని చెప్పారు. ఇటీవల నూతన క్యాజువాలిటీ, ఏఎంసీ విభాగాలను ప్రారంభించినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆయన అభినందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ. గోవిందరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు వాహనాల వేలం

కర్నూలు: అక్రమ రవాణా, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 27వ తేదీన కర్నూలు సెబ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సీఐ రాజేంద్రప్రసాద్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 27వ తేదీ ఉదయం 10 గంటలకు కార్యాలయం వద్దకు చేరుకుని రూ.5 వేలు డిపాజిట్ (తిరిగి ఇవ్వబడును) చెల్లించి వేలంలో పాల్గొనాలని సీఐ కోరారు.

ఆటో అపహరణ

కర్నూలు (అర్బన్): నగరంలోని మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ఆటో చోరీకి గురైంది. నగరపాలక సంస్థ పరిధిలోని జొహరాపురానికి చెందిన షేక్ సత్తార్ మియాకు సొంతమైన ఏపీ 07 టీఈ 6461 నంబర్ గల ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు.ఫైనాన్స్‌లో లోన్ తీసుకుని ఆటో కొనుగోలుచేసి నడుపుతూ జీవనం సాగించే తాను ఈ నెల 24న సాయంత్రం 5:30 గంటల సమయంలో నంద్యాల చెక్ పోస్టు జొహరాపురం 60 అడుగుల రోడ్డులోని వైన్‌షాప్ ముందు ఆటోను పార్క్ చేసి బాత్‌రూమ్‌కు వెళ్లానన్నారు. పది నిమిషాల అనంతరం తిరిగి వచ్చి చూడగా ఆటో కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఈ మేరకు కేసు నమోదు చేసివిచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీలకు అన్యాయం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ సుభాన్ విమర్శించారు. ఆయన గురువారం స్థానిక అవాజ్ కమిటీ కార్యాలయంలో మాట్లాడుతూ.. మైనార్టీ యువకుల నైపుణ్యాభివృద్ధి, విద్యార్థుల స్కాలర్‌షిప్పులకు కోత పెట్టినట్లు వివరించారు.

ఓపీ చీటీ చించేసి చికిత్స నిరాకరణ

● కర్నూలు సర్వజన ఆస్పత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం



ఆస్పత్రిలో బిడ్డను ప్రసవించిన మహిళ

కర్నూలు (హాస్పిటల్): ప్రసవం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణిని ఆసుపత్రిలో చేర్చుకోకుండా వైద్యులు ఓపీ చీటీని చించేసి బయటకు పంపిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు.. నందవరం మండలం గురజాల గ్రామానికి చెందిన కమ్మరి శశికళ (22) మొదటి కాన్పు కోసం ఎమ్మిగనూరు ఆసుపత్రికి వెళ్లింది. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో అక్కడి వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. దీంతో ఆమెను బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మిగనూరు నుంచి అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. నెలలు నిండలేదని, మళ్లీ రావాలని వైద్యులు చెప్పగా కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్చుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఓపీ చీటీ చించేసి ఆసుపత్రిలో చేర్చుకునేది లేదు, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. అంటూ వైద్యులు వెనక్కు పంపించారు. చివరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారులను సంప్రదించగా వారి సిఫారసుతో సాయంత్రం 5:30 గంటలకు వైద్యులు ఆసుపత్రిలో చేర్చుకున్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు సిజేరియన్ ద్వారా ఆమె మగబిడ్డను ప్రసవించారు. ఈ విషయమై ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల నిండు గర్భిణికి, ఆమె కడుపులోని పిండానికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని వారు ప్రశ్నించారు. ప్రసూతి విభాగంలోని లేబర్ రూమ్‌లో మగ పిల్లవాడు పుడితే రూ.2 వేలు, ఆడ పిల్ల పుడితే రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న కోరారు. ఈ సంఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఘటనపై పూర్తిస్థాయి విచారణకు డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ ఎంఓ డాక్టర్ వెంకటరమణను ఆదేశించినట్లు తెలిపారు.

దళితులపై దాడులను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): టీడీపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయని, నెలన్నర పాలనలో పదిచోట్ల దళితులపై దాడులు చేశారని, ఆదోనిలో గుండమ్మ అనే మహిళను అత్యంత కిరాతకంగా ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన గురువారం కార్మిక, కర్షక భవన్‌లో కల్లూరు మండల కేవీపీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులపై దాడులు జరుగుతున్నా అధికార పార్టీ స్పందించడం లేదన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడంతో దుండగులు హత్యలు, మానభంగాలు, దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కాగా, కర్నూలులో ఆగస్టు 1, 2 తేదీల్లో కేవీపీఎస్ సామాజిక చైతన్య శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు రత్నం, బీదన్న, రాముడు, రాజమణి, శీను, నాగేశ్వరరావు, దాసు, మద్దిలేటి, రంగన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో సత్తాచాటాలి

కర్నూలు (టౌన్): ప్యారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు పతకాలు సాధిస్తే ఎంతో మంది ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తారని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ స్పష్టం చేశారు. ఒలింపిక్స్‌కు వెళ్లిన భారత క్రీడాకారులకు మద్దతుగా గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం నుంచి క్రీడాకారులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ, ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడుతూ క్రీడాకారులకు ఆల్ దిబెస్ట్ చెప్పారు. స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎస్‌బీఐ సర్కిల్, చిన్న పార్కు, కోట్ల సర్కిల్, కోల్స్ కళాశాల మీదుగా కొండారెడ్డి బురుజు వరకు సాగింది. ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

కర్నూలు (అర్బన్): నగరంలోని పాతబస్తీకి చెందిన ఇద్దరు వ్యక్తులపై ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పాత బస్తీకి చెందిన లాల్ బాషా, మహబూబ్ బాషా అనే పాస్‌పోర్టు ఏజెంట్లు అదే ప్రాంతానికి చెందిన అల్తాఫ్‌ను కువైట్‌కు పంపారు. అక్కడ పరిస్థితులు అనుకూలించకపోవడంతో అల్తాఫ్ తిరిగి వచ్చేందుకు ప్రయత్నం చేయగా రిజిస్ట్రేషన్ లేదని అక్కడి అధికారులు ఇబ్బందులకు గురిచేశారు. అక్కడి రాయబారి కార్యాలయంలో రూ.35 వేలు చెల్లించి కర్నూలుకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలోనే తనను కువైట్‌కు పంపిన వారు ఇచ్చిన పాస్‌పోర్టు వల్లే తాను ఇబ్బందులు పడ్డానని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టాప్ నంబర్ లేని ఆటోలపై చర్యలు



ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు: ట్రాఫిక్ పోలీసులు ఆటోలకు కేటాయించే టాప్ నంబర్ లేకపోతే చర్యలు తప్పవని ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో గురువారం ఆటోలకు టాప్ నెంబర్లతో పాటు ఆధార్ కార్డుతో అనుసంధానం చేసిన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఎస్పీ పలు సూచనలు చేశారు. డ్రవర్లు క్రమశిక్షణతో పాటు నిబంధనలు పాటించాలని, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. వాహన రికార్డులు లేకపోయినా ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామనిని హెచ్చరించారు.

నిరంతరం స్పెషల్ డ్రైవ్...

ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోకుండా తిప్పుతున్న ఆటోలపై నిరంతరం స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ప్రధాన రద్దీ ప్రాంతాల్లో ప్రజలకు అసౌకర్యం కల్గించకుండా క్రమపద్ధతిలో వెళ్లాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, రాంగ్ పార్కింగ్ చేయరాదని సూచించారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం, లైసెన్స్, వాహన ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి ఆటో నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, ట్రాఫిక్ సీఐ గౌతమి, టూటౌన్ సీఐ ఇంతియాజ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.